

ఎండా కాలమ్

	గరిష్ఠం	కనిష్ఠం
అమలాపురం	36	29



కాగితాలపై కాకి లెక్కలు



- గెలుపు మాదంటే మాదంటున్న ప్రధాన పార్టీలు
- విజయావకాశాలపై టీడీపీ, జనసేన, వైసీపీ అభ్యర్థుల అంచనాలు

జిల్లాలోని ఆ ఏడు సీట్లూ మావేనని అమలాపురం ఎస్సీ రిజర్వుడు లోక్‌సభ స్థానానికి పోటీ చేస్తున్న అభ్యర్థులు అంటున్నారు. మరి ఏడూ మావే అయినప్పుడు ఎంపీ స్థానం కూడా మాదే కదా.. ఈ విషయంలో వేరే మాటకే తావిచ్చేది లేదంటూ అటు టీడీపీ, ఇటు వైసీపీ అభ్యర్థులు అంచనాలు వేసుకుంటున్నారు. జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో కూటమి తరపున ఐదింట టీడీపీ అభ్యర్థులు, రెండు స్థానాల్లో జనసేన అభ్యర్థులు పోటీ చేశారు. ఆయా స్థానాల్లో విజయం తమదేనన్న ధీమాను ఏడుగురు అభ్యర్థులూ వ్యక్తం చేయడం విశేషం.

అమలాపురం టౌన్, మే 20: కోనసీమ జిల్లా కేంద్రమైన అమలాపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్‌కు భారీగా క్రాస్ ఓటింగ్ కలిసి వస్తుందన్న ప్రచారం జోరుగా సాగుతోంది. వైసీపీ ఎంపీ అభ్యర్థి రాపాక వరప్రసాదరావు అంతగా ప్రచారంలో పాల్గొనకపోవడం, గత ఎన్నికల్లో హరీష్ చివరి దశలో ఓటమి చెందడం వంటి అంశాలను పరిగణలోకి తీసుకున్న ఓటర్లు అత్యధికంగా హరీష్‌వైపే మొగ్గు చూపినట్టు విశ్లేషకులు చెప్తున్నారు. వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థులు కొందరైతే తనకు ఓటు వేయాలని మాత్రమే అభ్యర్థించినట్టు ఓటర్లు చెప్తున్నారు. జిల్లాలోని ఏడు స్థానాల్లోనూ తమ పార్టీ అభ్యర్థులదే విజయంగా టీడీపీ, జనసేన శ్రేణులు అంచనాలు రూపొందించుకుంటూ విజయగర్వంతో ఉన్నారు. వైసీపీ అభ్యర్థులు సైతం పోలింగ్ పూర్తయిన తర్వాత బూత్‌ల వారీగా లెక్కలు కట్టి అంచనాలు సిద్ధం చేసుకున్నారు. ఏడింటిలో ఐదుచోట్ల కచ్చితంగా వైసీపీ అభ్యర్థులు అత్యధిక మెజార్టీతో గెలుస్తారని... రెండు సీట్లలో మాత్రం టీడీపీ, జనసేన అభ్యర్థులకు కొంత ఎడ్జ్ ఉన్నట్టు అంచనాలు ఉన్నాయంటున్నారు. ఐదేళ్ల జగన్ పాలనలో అందించిన సంక్షేమ పథకాలే అభ్యర్థుల విజయానికి బాటలు వేస్తాయంటున్నారు. జగన్ ప్రభంజనంలో ఆ స్థానాల్లో కూడా తమ అభ్యర్థులే స్వల్ప మెజార్టీతోనైనా గట్టెక్కుతారని వైసీపీ నాయకులు స్పష్టం చేస్తున్నారు. కూటమి అభ్యర్థులైతే చంద్రబాబు ప్రకటించిన సూపర్-6 పథకాలతో పాటు కూటమి ప్రకటించిన మేనిఫెస్టో ప్రజలను ఎంతగానో ఆకట్టుకుందన్నారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధి జరగాలని కోరుకుంటూ ప్రజలు ఓట్లు వేశారని చెప్తున్నారు. వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్టు భవిష్యత్తులో ఎంతమేర నష్టం చేకూరుస్తుందో ప్రజలు ముందుగానే అంచనా వేసుకున్నారు. కొంచెం రాజకీయ పరిస్థితులు తెలిసుండి నియోజకవర్గాల్లో ఓటింగ్ సరళి, ప్రజానాడిని అంచనా వేసిన విశ్లేషకులు ఎవరైనా ఫలానా స్థానం మీకొచ్చే అవకాశాలు పెద్దగా లేవని చెప్తుండగా ప్రధాన పార్టీల అభ్యర్థులు వాటిని అంగీకరించే పరిస్థితులు ఏమాత్రం లేవు. అందుకే ఏ పార్టీ నాయకుడు అడిగితే ఆ పార్టీ నాయకుడి పరిస్థితికి అనుగుణంగా విజయం మీదేనని చెప్తున్నారు. దాంతో ఆయా అభ్యర్థులు ఊహల ఊయలలో ఊగిపోతున్నారు. పోలింగ్ పూర్తయిన నాటి నుంచి కాగితాలపై కాకి లెక్కలు వేసుకుంటూ కూడికలు, తీసివేతలతో ఇంకా పలువురు అభ్యర్థులు గెలుపు కోసం కుస్తీ పడుతూనే ఉన్నారు.

సొమ్ములు ప్యాకింగ్ చేసేశారా...

ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో అభ్యర్థులు సొమ్ములను గతంలో కంటే తక్కువగానే పంచారు. ఓ ప్రధాన పార్టీ ఓటుకు రూ.1,500 చొప్పున పంపిణీ చేసింది. అయితే స్థానిక నాయకులతో కాకుండా ప్యాకింగ్ నాయకులు రావడం... వాళ్లచేతుల మీదుగా సొమ్ములు పంచి పెట్టడాన్ని స్థానిక నాయకులు పలుచోట్ల వ్యతిరేకించినట్టు సమాచారం. ఈ పరిస్థితిని గుర్తించిన ఆ పార్టీ నాయకులు ప్యాకింగ్ నాయకులతో స్థానిక నాయకత్వానికి రాజీ చేయగా పంచగా మిగిలిన సొమ్ములను ఎక్కడికక్కడ పంచుకున్నారన్న గుసగుసలు పలు గ్రామాల్లో వినిపిస్తున్నాయి. అందుకు కారణమూ లేకపోలేదు. పోలింగ్ రోజున కూడా సొమ్ములు అందలేదని పలు గ్రామాల నాయకులు నియోజకవర్గస్థాయి నాయకుల వద్ద క్యూ కట్టిన పరిస్థితులు ఉన్నాయి. కొందరు నాయకులైతే ఎన్నికల ఫలితం ఎలా ఉంటుందోనని ముందే సర్దేసుకున్నట్టు సమాచారం.

పవన్‌కు ఇచ్చిన మాటకు కట్టుబడ్డాం...

కూటమి నాయకుల్లో ఐకమత్యం లేదంటూ కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని జనసేన నాయకులు ఆరోపిస్తున్నారు. తమ అధినేత పవన్‌కల్యాణ్‌కు ఇచ్చిన మాటకు కట్టుబడి కూటమి అభ్యర్థుల విజయానికి రేయింబవళ్లు కృషి చేశామంటున్నారు. దూరాభారాన్ని సైతం లెక్కచేయకుండా ఓటింగ్‌లో పాల్గొనడం ఈసారి ఎన్నికల్లో ప్రధాన చర్చనీయాంశంగా మారింది. రాష్ట్ర, రాష్ట్రేతర ప్రాంతాల నుంచి వేలాదిమంది వచ్చి ఓటింగ్‌లో పాల్గొన్నారు. ఆ ఓట్లన్నీ మావంటేమావని ప్రధాన పార్టీల నాయకులు భావిస్తున్నారు. అయితే రాష్ట్రంలో ఉపాధి అవకాశాలు లేక ఇతర రాష్ట్రాలకు వలసలు వెళ్లి బతకాల్సి వస్తుందని... భవిష్యత్తులో ఎవరికీ ఆ పరిస్థితి ఉండకూడదన్న భావనతోనే వలస ఓటర్లు భారీగా తరలివచ్చారని కూటమి నాయకులు పేర్కొంటున్నారు.



అమలాపురం రూరల్ రోళ్లపాలెంలో తాళాలు తెరుచుకోని రైతు భరోసా కేంద్రం

రైతులకు భరోసా ఎప్పుడో!

- ప్రారంభించినా తెరుచుకోని రైతు భరోసా కేంద్రాలు
- నాలుగేళ్లయినా పూర్తికాని భవనాల నిర్మాణం
- టాయిలెట్ సౌకర్యం కల్పించాలని అన్నదాతల విన్నపం

అమలాపురం రూరల్, మే 20: రైతులకు భరోసా కల్పించే లక్ష్యంతో వైసీపీ ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల నిర్మాణం చేపట్టింది. నాలుగేళ్లయినా పూర్తికాని భవనాలు ఎన్నో ఉంటే.. అట్టహాసంగా హడావుడిగా ప్రారంభించిన భవనాలకు వేసిన తాళాలు నేటికీ తెరుచుకోలేదు. గతంలో ప్రారంభించిన భవనాల్లో మాత్రం విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌తో పాటు ప్రస్తుతం ధాన్యం కొనుగోళ్ల సీజను కాబట్టి ప్యాడీ ప్రోక్యూర్‌మెంట్ టెక్నికల్ అసిస్టెంట్లు ఆయా కేంద్రాల్లో పని చేస్తున్నారు. ధాన్యం కొనుగోళ్ల సమయంలో ఒక్కో ఆర్బీకేకు ఒక్కో టెక్నికల్ అసిస్టెంట్‌ను తాత్కాలిక ప్రాతిపదికన నియమిస్తున్నారు. రైతు భరోసా కేంద్రాల్లో పనిచేసే ఉద్యోగులతో పాటు ఎన్నో పనులపై వచ్చే రైతులకు ఆయా కేంద్రాల్లో కనీసం టాయిలెట్ సదుపాయం కూడా కల్పించకపోవడంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పలు గ్రామాల్లో దూరంగా నిర్మించిన ఆర్బీకేల్లో పనిచేస్తున్న మహిళా సిబ్బంది పడుతున్న అవస్థలు వర్ణనాతీతం.

ప్రారంభించారు సరే.. తాళాలు తెరిచేదెన్నడో..

ఎన్నికల కోడ్ అమల్లోకి వస్తుందన్న సమాచారంతో వారం రోజుల ముందు నుంచీ జిల్లాలో వైసీపీ ప్రజాప్రతినిధులు హడావిడిగా రైతు భరోసా కేంద్రాలను ప్రారంభించారు. ఆయా కేంద్రాల్లో కనీస సదుపాయాలు కల్పించకపోవడంతో అప్పుడు వేసిన తాళాలు మళ్లీ తెరుచుకోలేదు. జిల్లాలో 208 పంచాయతీల పరిధిలో 247 రైతు భరోసా కేంద్రాల నిర్మాణం చేపట్టారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిలోనే ఆర్బీకేల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. నాలుగేళ్లవుతున్నా ఇంకా 80 భవనాలు నేటికీ పూర్తి కాలేదు. 167 భవనాల నిర్మాణం పూర్తి చేసినట్టు గణాంకాలు చెప్తున్నా వాటిలో సగం మేర భవనాలకు కనీసం విద్యుత్ సదుపాయం కూడా కల్పించకపోవడంతో ఆయా కేంద్రాలు తెరుచుకోని దుస్థితి. రోళ్లపాలెం, ఇందుపల్లి, బండారులంక, నడిపూడి వంటి గ్రామాల్లో ఆర్బీకేలను ప్రారంభించి తాళాలు వేసేశారు. ఇక మండల పరిధిలోని నల్లమిల్లి, ఎ.వేమవరం, వన్నెచింతలపూడి, చిందాడగరువు, పేరూరు-1, 3, కామనగరువు-2 ఆర్బీకేల నిర్మాణం ఎప్పుడు పూర్తవుతుందో తెలియని పరిస్థితి. ఆర్బీకేల నిర్మాణాల్లో టాయిలెట్ సదుపాయం కల్పించని విషయాన్ని ఉన్నతాధికారులు ఆలస్యంగా గుర్తించారు. టాయిలెట్ సదుపాయం కల్పించాలని కోరినప్పటికీ డిజైన్‌లో మార్పులు చేసే పరిస్థితులు లేవని ఉన్నతాధికారులు తేల్చి చెప్పేశారు. అయినప్పటికీ ప్రతిపాదనల దశలోనే టాయిలెట్ల నిర్మాణం నిలిచిపోయింది.

రైతులకు అవసరమైన సేవలన్నీ అక్కడే...

రైతులకు సంబంధించి అన్ని రకాల సేవలను రైతు భరోసా కేంద్రాల్లో అందుబాటులోకి తీసుకువచ్చారు. రైతులతో సమావేశాలు నిర్వహించడం, వారికి అవసరమైన ఎరువులు అందజేయడం... ఇలా ఎన్నో కార్యక్రమాలను ఆర్బీకేలోనే నిర్వహించాల్సి ఉంది. అయితే జిల్లాలో పలు ఆర్బీకేలు నేటికీ అద్దె భవనాల్లోనే కొనసాగుతున్నాయి. ఆయా కేంద్రాలను వ్యవసాయాధికారులు పర్యవేక్షిస్తుంటారు. జిల్లాలో తాళాలు వేసిన ఆర్బీకేలు తెరుచుకునేది ఎప్పుడో... అసంపూర్తిగా మిగిలిపోయిన భవనాల నిర్మాణం పూర్తయ్యేది ఎన్నడో అని ఎదురు చూస్తున్నారు.



అల్లవరం మండలం కోడూరుపాడులో రైతు భరోసా కేంద్రానికి తాళం వేసి వున్న దృశ్యం



మట్టి నమూనా పరీక్షలు చేస్తున్న వ్యవసాయ సిబ్బంది (పాత చిత్రం)

భూసార పరీక్షలకు మంగళం!

మండపేట, మే 20:

ప్రతి ఏటా దాళ్వా వ్యవసాయ పనులు పూర్తయిన తర్వాత వేసవిలో మే నెల మొదటివారంలో భూసార పరీక్షల కోసం వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో పొలాల నుంచి మట్టి నమూనాల సేకరణ జరుగుతుంది. కానీ ఈ ఏడాది మట్టి పరీక్షలు జరుగుతున్న దాఖలాలు కనిపించట్లేదు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1.60 లక్షల ఎకరాల్లో వరి పంట సాగవుతుంది. మట్టి పరీక్షల ద్వారా భూముల్లో సారం ఎంత వుంది, మట్టి నాణ్యత, ఎరువులను ఎలా వినియోగించాలి, రసాయన ఎరువులు ఎంత మేర అవసరం అనే అంశాలు తెలుసుకునే వీలుంటుంది. కానీ భూసార పరీక్షలకు సంబంధించి ఇప్పటివరకు ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాకపోవడంతో వ్యవసాయ శాఖ అధికారులు మట్టి నమూనాలు సేకరించట్లేదు. ప్రతి సంవత్సరం మే నెల మొదటి వారంలో నమూనాలను సేకరించి ఆగస్టు నాటికి ఫలితాలను వెల్లడించేవారు. కానీ నేడు ఆ పరిస్థితి లేదు. వ్యవసాయ శాఖ అధికారులు సార్వత్రిక ఎన్నికల విధుల్లో ఉండడం కూడా ఇందుకు కారణమని భావిస్తున్నారు. నిన్న, మొన్నటి వరకు మండే ఎండలు... నేడు అకాల వర్షాలతో రైతులు సార్వా పనులపై దృష్టిసారిస్తున్నారు. మట్టి నమూనా పరీక్షలకు బడ్జెట్‌ను కేంద్రం విడుదల చేయట్లేదు. దీంతో పరీక్షలు జరగట్లేదని తెలుస్తోంది. గతంలో వికసిత్ భారత్ కార్యక్రమాల్లో రైతులకు పత్రాలు అందించి తిరిగి తీసేసుకున్నారు.

భూసార పరీక్షలు. విత్తనం, పురుగు మందుల నాణ్యత గుర్తించడం... వంటి సేవలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అగ్రి ల్యాబ్‌ల నిర్మాణం చేపట్టింది. కానీ జిల్లాలో ఎక్కడా ఆ భవనాలు పూర్తయిన దాఖలాలు లేవు. ల్యాబ్ భవనం, పరికరాల కోసం ప్రభుత్వం రూ.70 లక్షలు వరకు కేటాయించింది. కానీ పూర్తిస్థాయిలో పనులు పూర్తి చేసి తమకు సేవలందించట్లేదని రైతులు వాపోతున్నారు. మండపేట మండలం తాపేశ్వరంలో అగ్రి ల్యాబ్ భవన నిర్మాణం మధ్యలోనే నిలిచిపోయింది.

జిల్లాలోని 22 మండలాల్లో ఈ ఏడాది ఎక్కడా భూసార పరీక్షలు జరగలేదు. దీనిపై వ్యవసాయ శాఖ అధికారిని వివరణ కోరగా... మట్టి నమునా పరీక్షలకు సంబంధించి ప్రభుత్వం నుంచి ఎటువంటి ఆదేశాలు రాలేదని, బడ్జెట్ నిధుల కొరత కారణంగా నమునాలు సేకరించలేదన్నారు.

శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా సహకరించాలి

కౌంటింగ్ రోజున బాణసంచా కాల్పులు, విజయోత్సవ ర్యాలీలకు అనుమతులు లేవు ఎస్పీ శ్రీధర్

అమలాపురం టౌన్, మే 20: సార్వత్రిక ఎన్నికల కౌంటింగ్ రోజున జిల్లాలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు సహకరించాలని ఎస్పీ ఎస్.శ్రీధర్ కోరారు. ఓట్ల లెక్కింపు రోజున బాణసంచా కాల్పులు, విజయోత్సవ ర్యాలీలకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. కౌంటింగ్ రోజున శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రజలంతా సహకరించాలని ఆయన కోరారు. జిల్లాలో ఎవరూ లూజు పెట్రోలు అమ్మరాదని, పెట్రోలు బంకుల వద్ద విడిగా విక్రయాలు జరిపితే లైసెన్సుల రద్దుకు సిఫార్సు చేస్తామన్నారు. ఎవరైనా అనధికారికంగా బాణసంచా కలిగి ఉంటే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కాట్రేనికోన మండలం చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటుచేసిన స్ట్రాంగ్ రూములను సోమవారం ఆయన పరిశీలించారు. మూడంచెల భద్రతను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదనపు ఎస్పీ ఎస్.ఖాదర్‌బాషా నేతృత్వంలో ఓట్ల లెక్కింపు దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా కాట్రేనికోన మండల పరిధిలోని సమస్యాత్మక గ్రామాలు, మత్స్యకార గ్రామాల్లో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా కేంద్ర బలగాలు, పోలీసులతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు.

అయినవిల్లి పోలీసుస్టేషన్ పరిధిలో కొత్తపేట డీఎస్పీ కె.వెంకటరమణ నేతృత్వంలో పి.గన్నవరం సీఐ ప్రశాంత్‌కుమార్, ఎస్ఐ రాజేష్‌కుమార్ ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలతో కలిసి సమస్యాత్మక గ్రామమైన చింతనలంకలో పోలీసులు కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. విస్తృత సోదాలు చేసి రికార్డులు లేని 15 మోటారు సైకిళ్లు, 10 డ్యూటీ పెయిడ్ లిక్కర్ బాటిళ్లను సీజ్ చేశారు. గంటిలో వాహనాల తనిఖీ నిర్వహించారు. అంబాజీపేటలో నిర్వహించిన కార్డన్ అండ్ సెర్చ్‌లో ఏడు మోటారు సైకిళ్లను సీజ్ చేశారు. రామచంద్రపురం డీఎస్పీ బి.రామకృష్ణ, సీఐ దొరరాజు ఆధ్వర్యంలో ఉట్రుమిల్లి రాజీవ్ గృహకల్ప అపార్టుమెంటులో రికార్డులు లేని 27 మోటారు సైకిళ్లను సీజ్ చేశారు. ఓట్ల లెక్కింపు దృష్ట్యా లైసెన్సు కలిగిన బాణసంచా తయారీ కేంద్రాలను తనిఖీ చేశారు. అనధికారికంగా బాణసంచా తయారీచేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. డీఎస్పీ ఎం.మహేశ్వరరావు, ట్రాఫిక్ ఎస్ఐ నబీ తదితరులు పాల్గొన్నారు.





చెయ్యేరు శ్రీనివాసా ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ శ్రీధర్

కొబ్బరి కొనుగోళ్లకు కేంద్రం గ్రీన్ సిగ్నల్

- కోనసీమలో త్వరలో నాఫెడ్ కేంద్రాలు ఏర్పాటు
- 8వేల టన్నుల కొబ్బరి కొనుగోళ్లు లక్ష్యం
- ఆయిల్‌ఫెడ్ సీనియర్ మేనేజరు సుధాకరరావు



అంబాజీపేట, మే 20: కొబ్బరి రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. కోనసీమలో త్వరలో నాఫెడ్ కేంద్రాల ఏర్పాటుకు కేంద్రం ఉత్తర్వులు జారీ చేసిందని ఆయిల్‌ఫెడ్ సీనియర్ మేనేజరు యు.సుధాకరరావు విలేకరులకు తెలిపారు. కొబ్బరి రైతుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం ఈ నెల 15న కేంద్రానికి లేఖ రాసింది. ఈ మేరకు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ ఉప కార్యదర్శి సంజయ్‌కు మార్ కొబ్బరి కొనుగోలు చేయాలని ఉత్తర్వులను రాష్ట్ర ఉద్యానవన శాఖ కమిషనరు శ్రీధర్‌కు పంపించారు. గత ఏడాది బాల్‌కోప్రా రూ.11,750కు కొనుగోలు చేయగా ఈ ఏడాది రూ.12వేలకు కొనుగోలు చేస్తామన్నారు. మిల్లింగ్‌కోప్రా గత ఏడాది రూ.10,860కు కొనుగోలు చేయగా ప్రస్తుతం 11,160కు కొనుగోలు చేస్తామన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు కేంద్రాలను ప్రారంభించేందుకు రాష్ట్ర ప్రభుత్వానికి లేఖ రాసినట్టు సుధాకరరావు తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు వచ్చిన అనంతరం కోనసీమలోని అంబాజీపేటలో మొదట కొనుగోళ్లు ప్రారంభిస్తామన్నారు. కోనసీమలోని ముమ్మిడివరం, కొత్తపేట, తాటిపాక, నగరంలో ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. ఆరు నెలల్లో 8వేల క్వింటాళ్ల కొనుగోలు లక్ష్యంగా నిర్ణయించినట్టు చెప్పారు. మూడు నెలల్లో 4వేలు వంతున కొనుగోలు చేస్తామని సుధాకరరావు వివరించారు.



కపిలేశ్వరపురం ఇసుక ర్యాంపును పరిశీలిస్తున్న సాయిరాం

ఇసుక అక్రమ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు

మైన్స్, జియాలజీ శాఖ సహాయ సంచాలకుడు సాయిరాం

కపిలేశ్వరపురం, మే 20: ఇసుక ర్యాంపుల్లో అక్రమ తవ్వకాలు జరిపితే కఠిన చర్యలు తప్పవని మైన్స్, జియాలజీ శాఖ సహాయ సంచాలకుడు సాయిరాం హెచ్చరించారు. సోమవారం అయన రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు శాఖల అధికారులతో కలిసి మండలంలోని కపిలేశ్వరపురం, తాతపూడి ఇసుక ర్యాంపులను పరిశీలించారు. పగలు, రాత్రి వేళల్లో ర్యాంపుల్లో ఇసుక తవ్వకాలు జరగకుండా ఉండేందుకు ఎప్పటికప్పుడు నిఘా ఏర్పాటు చేసి సమన్వయంతో పనిచేయాలన్నారు. ర్యాంపుల్లోకి వాహనాలు ప్రవేశించకుండా ఉండేందుకు బాట మార్గంలో 2మీ. వెడల్పు, 3 మీ. లోతులో గుంతలు ఏర్పాటు చేయాలని రెవెన్యూ అధికారులకు సూచించారు. అనంతరం సాయిరాం మాట్లాడుతూ ప్రిన్సిపల్ సెక్రటరీ, సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఇసుక ర్యాంపుల పరిస్థితులపై ఎప్పటికప్పుడు నివేదికలు పంపించాల్సి ఉందన్నారు. ఇందుకోసం మైనింగ్, రెవెన్యూ, ఇరిగేషన్, పోలీసు, ఎస్ఈబీ శాఖల అధికారులతో రెండు బృందాలు ఏర్పాటు చేశామన్నారు. ఇవి ర్యాంపుల్లో పర్యటించి అక్రమ తవ్వకాలను నిరోధిస్తుందన్నారు. ఎక్కడైనా ఇసుక అక్రమ తవ్వకాలు, వాహనాల్లో తరలింపు జరిగితే అక్కడే పట్టుకుని సీజ్ చేసి పోలీస్ స్టేషన్‌కు కంప్లైంట్ ఇచ్చి క్రిమినల్ చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ఏఈఈ బి. శ్రీఫణిత, మైన్స్ ఆర్ఐ సుజాత, డిప్యూటీ తహసీల్దారు వెంకటేశ్వరరావు, ఎస్ఈబీ ఎస్ఐ ఎ.సత్యవాణి, ఆర్ఐ వి.శ్రీనివాస్, సర్వేయరు ఎస్.సతీష్, వీఆర్వోలు ప్రసాద్, శ్రీనివాస్, వీఆర్ఏలు ప్రకాష్, జగన్ పాల్గొన్నారు.



ఏపీఈఏపీ సెట్‌కు 680 మంది హాజరు

అమలాపురం రూరల్, మే 20: భట్లపాలెం బీవీసీ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం నిర్వహించిన ఏపీఈఏపీ సెట్‌కు 680 మంది విద్యార్థులు హాజరు కాగా పది మంది గైర్హాజరయ్యారు. ఉదయం సెషన్‌లో 345 మందికి 337 మంది, మధ్యాహ్నం సెషన్‌లో పరీక్షకు 345 మందికి 343 మంది హాజరైనట్టు ఆన్‌లైన్ సెంటర్ కో-ఆర్డినేటర్ అడబాల కుమార్ తెలిపారు. విద్యార్థులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా ప్రిన్సిపాల్ డాక్టర్ జేవీజీ రామారావు, పరిపాలనాధికారి జక్కం వెంకటకృష్ణారావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.




మోతుగూడెం: ఆంధ్ర, ఒడిశా సరిహద్దు గ్రామాల సమీపంలో కనువిందు చేస్తున్న మేఘాలు



ఉప్పాడ తీరంలో కనువిందు చేస్తున్న మేఘాలు

అబ్బురపరిచిన

వెండి మబ్బులు

వృద్ధురాలిపై యువకుల అత్యాచారం

గొల్లప్రోలు, మే 20: ఓ వృద్ధురాలిపై ఇద్దరు యువకులు అత్యాచారానికి పాల్పడిన సంఘటన కలకలం రేపింది. పట్టణానికి చెందిన 60 ఏళ్ల వృద్ధురాలి భర్త 30 సంవత్సరాల క్రితం చనిపోయాడు. అప్పటి నుంచి పట్టణంలో ఓ రైతుకు చెందిన మకాంలో గేదెలను మేపుకుంటూ జీవనం సాగిస్తున్నది. ఆదివారం అర్ధరాత్రి సమయంలో వృద్ధురాలు నిద్రిస్తున్న సమయంలో ఇద్దరు యువకులు ఆమెపై బలవంతంగా అత్యాచారానికి పాల్పడ్డారు. దీంతో షాక్‌కు గురయిన ఆమె తేరుకోలేకపోయింది. సోమవారం తెల్లవారుజామున 2.30 గంటల సమయంలో కుమారుడికి ఫోన్‌లో సమాచారం అందించింది. ఇద్దరు యువకులపై అనుమానం వ్యక్తం చేస్తూ బాధితురాలి కుమారుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. గొల్లప్రోలు ఎస్‌ఐ బాలాజీ కేసు నమోదు చేశారు. వృద్ధురాలిని వైద్య పరీక్షల నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

చికిత్స పొందుతూ ఇంజనీరింగ్ విద్యార్థి మృతి

ఫెయిల్ కావడంతో మనస్తాపం

ఇటీవల పురుగుల మందు తాగిన వైనం



గొల్లప్రోలు రూరల్, మే 20: వరుసగా ఫెయిల్ అవుతుండటంతో మనస్తాపానికి గురైన ఇంజనీరింగ్ విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం గోపాలపట్నం గ్రామానికి చెందిన కోనేటి రాజా నరేంద్ర(21) గొల్లప్రోలు మండలం చేబ్రోలు ఆదర్శ్ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ సీఎస్ఈ విభాగంలో మూడో సంవత్సరం చదువుతున్నాడు. మొదటి రెండు సంవత్సరాలు ఇంజనీరింగ్ పరీక్షల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురయ్యాడు. ఈ నెల 4వ తేదీన ఇంజనీరింగ్ కళాశాల వెనుక ఉన్న జీడిమామిడి తోటలో పురుగుల మందు తాగాడు. విషయాన్ని తన సోదరుడు, హైదరాబాదులో ఉంటున్న సత్య సాయి కుమార్‌కు ఫోన్‌లో తెలిపాడు. దీనితో అతను తన స్నేహితుడిని అక్కడకు పంపి రాజా నరేంద్రను తొలుత ప్రైవేటు ఆసుపత్రికి, అక్కడ నుంచి కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి మరణించినట్లు గొల్లప్రోలు పోలీసులకు సోమవారం సాయి సత్యకుమార్ ఫిర్యాదు చేశారు. గొల్లప్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

తాటిచెట్టుపై నుంచి పడి గీత కార్మికుడి మృతి



కొత్తపల్లి, మే 20: చెట్టుపై కల్లు గీస్తుండగా దురదృష్టవశాత్తు మోకు జారడంతో గీత కార్మికుడు చెట్టుపై నుంచి పడి అక్కడికక్కడే మృతిచెందాడు. కాకినాడ జిల్లా కొత్తపల్లి మండలం కొమరగిరి శివారు వెంకట రాయపురంలో సోమవారం ప్రతీ రోజు మాదిరిగానే ఉదయాన్నే శీలం లక్ష్మణరావు(52) తాటి చెట్టు ఎక్కి కల్లు గీస్తున్నాడు. చెట్టుపై కల్లు గీస్తుండగా మోకు తాళ్లు తెగిపోవడంతో లక్ష్మణరావు ఒకేసారి కిందకు జారిపడ్డాడు. చెట్టుపై నుంచి కింద పడిన లక్ష్మణరావు అక్కడికక్కడే మృతిచెందాడు. లక్ష్మణరావుకు భార్య, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కొత్తపల్లి పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. కేసు నమోదు చేసి మృతదేహాన్ని పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

అరుంధతి నక్షత్ర దర్శనం

కల్యాణోత్సవాల్లో మూడో రోజు రత్నగిరిపై వివిధ కార్యక్రమాలు



అరుంధతి నక్షత్రం చూపిస్తున్న పండితులు



గ్రామోత్సవానికి హాజరైన భక్తులు

అన్నవరం, మే 20: సత్యదేవుడి వార్షిక దివ్య కల్యాణోత్సవాలలో భాగంగా మూడో రోజైన సోమవారం నవ దంపతులైన సత్యదేవుడు, అనంతలక్ష్మి అమ్మవార్ల అరుంధతి నక్షత్ర దర్శనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. రాత్రి 7 గంటలకు పండితులు ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా స్వామి,అమ్మవార్లను ప్రధానాలయం నుంచి తూర్పురాజగోపురం వద్దకు మేళతాళాలతో తోడ్కొనివచ్చారు. ప్రత్యేకపూజలు అనంతరం దాంపత్యజీవితానికి ప్రతీకలైన వశిష్ట, అరుంధతి నక్షత్రాలను చూపించి వారికి అర్ఘ్యం అందించారు. అంతకు ముందు సాయంత్రం 5గంటలకు దర్బారు మండపంలో ప్రధాన ప్రవేశస్థాలిపాక హోమాలు జరిగాయి. ప్రధానార్చకులు కోట సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో పండితులు ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. వివాహం అనంతరం అమ్మవారు మెట్టినింటికి చేరుకుని అక్కడనుంచి మరో జీవన ప్రయాణానికి నాంది పలికేందుకు ప్రతీకగా ఈ వేడుక జరిగింది. చతుర్వేదపండితుల వేదాశీర్వచనాలు అందజేశారు.

రావణ వాహనంపై విహారం



సత్యదేవుడి వార్షిక కల్యాణోత్సవ గ్రామోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి స్వామి,అమ్మవార్లు రావణ వాహనంపై విహరించారు. వివిధ సాంస్కృతి కార్యక్రమాల నడుమ ఈ వేడుక కోలాహలంగా జరిగింది. స్వామివారి వాహన సేవలలో రావణ వాహనసేవకు అధిక ప్రాధాన్యం ఉండడంతో అన్నవరం పరిసర ప్రాంతాల నుంచి అధిక సంఖ్యలో రావణ వాహన సేవను తిలకించారు. తప్పెటగుళ్లు, కోలాటం, వివిధ దేవతా మూర్తుల వేషధారణలు విశేషంగా ఆకట్టుకున్నాయి.

సూర్యభగవానుడికి బూరెల సమర్పణ



బూరెలు సమర్పిస్తున్న దృశ్యం

అన్నవరం, మే 20: రత్నగిరివాసుడైన సత్యదేవుడి సన్నిధిలో అత్యంత ప్రాముఖ్యమైన దివ్యకల్యాణం ఆదివారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. అయితే కల్యాణానికి ముందు ఆకాశమంతా మేఘావృతమై వర్షంపడి అవాంతరాలు ఏర్పడతాయేమోనని భావించారు. అయితే వరుణుడి వర్షం నుంచి విముక్తి కల్పించడంతో సూర్యభగవానుడికి సోమవారం దేవస్థానం తరుపున దేవదాయ కమిషనర్ సత్యనారాయణ దంపతులు బూరెలు సమర్పించి మొక్కు చెల్లించారు. బూరెలను తూర్పురాజగోపురం వద్ద నుంచి ఆకాశం వైపునకు విసరారు. అంతకు ముందు కమిషనర్ దంపతులు సత్యదేవుడిని దర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఈవో రామచంద్రమోహన్ తదితరులు పాల్గొన్నారు.

వాటర్ యాపిల్స్

పోషకాలు మెండు



కడియం, మే 20: పుల్లపుల్లగా, తియ్యతీయగా ఉండే వాటర్ యాపిల్స్‌ను జంబోఫలం, గులాబీ జామ్ అంటారు. వేసవి తీవ్రతకు కలిగే దాహార్తి నుంచి ఉపశమనం కలిగేందుకు చల్లని నీరు, మజ్జిగ, కొబ్బరిబొండాం, లస్సీలు, జ్యూస్‌లు వంటి వాటిని తాగుతుంటాం. అలానే వీటితో పాటు మినరల్స్, సీ-విటమిన్ పుష్కలంగా ఉండే వాటర్ యాపిల్స్ కూడా మనకు మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయి. కడియం నర్సరీలో వాటర్ యాపిల్స్ ఎరుపు, గ్రీన్, మల్టీకలర్ వంటి రంగుల్లో మనకు లభిస్తున్నాయి. వేసవిలో గుత్తులు, గుత్తులుగా కాసే ఈ వాటర్ యాపిల్స్‌లో మంచి పోషకాలు ఉండటంతో పాటు దాహార్తి నుంచి మనకు ఎంతో ఉపశమనాన్ని కలిగిస్తాయనడంలో ఎటువంటి సందేహం లేదు. వాహనాల్లో ప్రయాణించే సమయంలోను, ఇతర ప్రాంతాలకు వెళ్లే సమయంలోను వీటిని వెంట తీసుకెళితే దాహార్తిని తీర్చే ఔషధంగా ఎంతో మేలు చేస్తాయని నర్సరీ రైతులు అంటున్నారు. ఈ చెట్టు పెరిగే కొద్దీ ఫలాలతో పాటు మంచినీడ కూడా ఇస్తుంది. వాటర్ యాపిల్స్ మొక్కలను వాణిజ్య పంటగా కూడా వేసుకుంటే మంచి లాభాలు ఉంటాయని. నల్లరేగడి భూములతో పాటు, ఎర్రనేలల్లో కూడా ఈ మొక్కలు బాగా పెరుగుతూ మంచి ఫలాలలను ఇస్తాయని నర్సరీ రైతులు చెబుతున్నారు.

మట్టి తరలింపు వాహనాలు సీజ్



వాహనాలను సీజ్ చేసిన అధికారులు



కరప, మే 20: కరప మండలం యండమూరులోని చేలల్లో మట్టిని తరలిస్తున్నట్లు అందిన ఫిర్యాదు మేరకు రెవెన్యూ, పోలీస్ శాఖ అధికారులు సంయుక్త దాడులు నిర్వహించారు. పెద్దాపురప్పాడు గ్రామానికి చెందిన ఏడు ట్రాక్టర్లను సీజ్ చేసి కరప పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అనంతరం ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఒక్కో మట్టి ట్రాక్టర్‌కు రూ.3 వేలు చొప్పున ఫెనాల్టీ విధించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ వాసిరెడ్డి రామకోటేశ్వరరావు మాట్లాడుతూ అనుమతులు లేకుండా మళ్లల్లో మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మట్టి ట్రాక్టర్ రోడ్డెక్కితే వెంటనే వాటిని సీజ్ చేయాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. పొలాల్లో మెరకలు తీసుకోవాలంటే సంబంధిత రైతు ముందుగా తహశీల్దార్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. స్థానిక వీఆర్‌వోతో విచారణ చేయించి మళ్లల్లో మట్టిని మళ్లల్లోనే సర్దుబాటు చేసుకునేలా అనుమతినిస్తామన్నారు. కాగా పెదకొత్తూరు, కరప, కొరుపల్లి, గొడ్డటిపాలెం, అరట్లకట్ట, కూరాడ, పెనుగుదురు తదితర గ్రామాల్లో మళ్లల్లోని మట్టిని ఇటుక బట్టీల్లోకి, దిమ్మలకు యథేచ్ఛగా తరలించుకుపోతున్నారు. అయితే అధికారులు పట్టించుకోవడం లేదని పలువురు ఆరోపిస్తున్నారు. ట్రాక్టర్ తొట్టి నుంచి మట్టి అండలు రోడ్డుపై పడి చినుకులకు తడిచి వాహనచోదకులు ప్రమాదాలకు గురవుతున్నారని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వేసవి వచ్చిందంటే గ్రామాల్లో మట్టి మాఫియా చేస్తున్న ఆగడాలను అరికట్టేలా చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

అధికారుల 'సరిహద్దు' మాయ

ఇసుక అక్రమ తవ్వకాలపై తప్పించుకునే యత్నం

తీపర్రు, ఉసులుమర్రులో యథేచ్ఛగా తవ్వకాలు

ఇటీవల పరిశీలించిన తూర్పు అధికారులు

ఆ సరిహద్దు కోనసీమదంటూ దాటవేత

అది తప్పంటున్న రెండు గ్రామాల ప్రజలు



తీపర్రు ర్యాంప్‌లో ఇసుక తవ్వుతున్న దృశ్యం (ఫైల్)

పెరవలి, మే 20: గోదావరి నదిలో ఇసుక అక్రమ తవ్వకాలపై సుప్రీం కోర్టు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆయా శాఖల అధికారుల్లో కదలిక వచ్చి ఆగమేఘాలపై పరుగులు తీశారు. అయితే తిమ్మిని బమ్మిని చేసి అక్రమాలు గుట్టు తేలకుండా అంతా సవ్యంగానే ఉన్నట్టు నమ్మించే ప్రయత్నం చేస్తున్నారు. తీపర్రు ఇసుక ర్యాంప్‌లో మూడు నెలలుగా జరిపిన ఇసుక అక్రమాలపై తీపర్రు, ఉసులుమర్రుకు చెందిన ప్రజానీకం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. భారీ అంచనాలతో ఇష్టారాజ్యంగా వందలాది లారీలు ఇసుక తవ్వుకుని పోతుంటే ఏమి పట్టనట్టు వ్యవహరించిన అధికార యంత్రాంగం సాఫీగా వచ్చి ఏమీ జరగనట్టుగా ఉండడం విడ్డూరమని వ్యాఖ్యానిస్తున్నారు. ఇక్కడ అక్రమ తవ్వకాలకు తామే సాక్ష్యమని, ఏ అధికారి వచ్చినా ఏ మేరకు ఇసుక తవ్వకాలు జరిగాయో చెబుతామంటున్నారు. తూర్పుగోదావరి జిల్లా వైపునకు తీపర్రు గ్రామం చేర్చి ఉన్నప్పటికీ ఇసుక తవ్వకాలు అన్ని కోనసీమ జిల్లా పరిధిలో జరిగినట్టు అధికారులు చెప్పడం విడ్డూరమంటున్నారు. గత 30 ఏళ్లుగా ఇసుక తవ్వకాలు జరుగుతున్నాయని, ఇటువంటి పరిధులు ఎప్పుడూ అధికారులు నుంచి వినలేదని చెబుతున్నారు. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లాకు సంబంధించి వివిధ శాఖల అధికారులే ఇక్కడ తనిఖీలు జరిపి కేసులు నమోదు చేసేవారని, అక్రమ తవ్వకాలపై జరిమానాలు కూడా విధించేవారని గుర్తు చేస్తున్నారు. ప్రస్తుతం దానికి విరుద్ధంగా కొత్త జిల్లాలు ఏర్పడిన అనంతరం ఈ ప్రాంతం తూర్పుగోదావరిలోకి, గోదావరి అవతలి ప్రాంతం కోనసీమ జిల్లాలోకి మారాయి. దీంతో అవతలి వైపు భాగాన్ని కోనసీమ జిల్లా అధికారులు పరిశీలించాలని ఇక్కడి అధికారులు చేతులు దులుపుకోవడం సబబు కాదని పేర్కొంటున్నారు. అయితే కోనసీమ జిల్లా అధికారులైనా స్పందించి ఈ ప్రాంతానికి వచ్చి విచారిస్తే తాము సాక్ష్యాధారాలతో అక్రమ తవ్వకాల బాగోతం బయట పెడతామని ఇక్కడి ప్రజలు చెబుతున్నారు. ప్రతిమ కంపెనీకి 2025 సంవత్సరం వరకు అనుమతులు ఉన్నాయని చెబుతున్న అధికారులు అసలు ఆ కంపెనీకి ఏ జిల్లా అధికారులు అనుమతులు ఇచ్చారో, దానికి నిర్ణయించిన పరిధులు ఏమిటో, ఎన్ని క్యూబిక్ మీటర్లు ఉంటాయో తెలియజేయాలని డిమాండ్ చేస్తున్నారు. తూర్పుగోదావరి జిల్లా అధికారుల అనుమతి పొంది కోనసీమ జిల్లా పరిధిలో ఇసుక తవ్వకాలు జరిపితే అవి అక్రమ తవ్వకాలే కాబట్టి వెంటనే కోనసీమ జిల్లా అధికారులు స్పందించి కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ఈ అక్రమ తవ్వకాలు తమతో పాటు తూర్పుగోదావరి జిల్లా మైనింగ్, ఇరిగేషన్, రెవెన్యూ శాఖల అధికారులు కూడా సాక్ష్యం చెబుతారని, అక్రమంగా తవ్విన ఇసుక గుట్టలు కూడా నిడదవోలు-నరసాపురం రహదారి పక్కన ఉన్నాయని పేర్కొంటున్నారు. కోనసీమ జిల్లా అధికారులు వెంటనే స్పందించి విచారణ చేపట్టాలని, ఆ గుట్టలు కూడా తరలిపోతే ఇసుక అక్రమ తవ్వకాల సాక్ష్యం లేకుండా పోతుందని పేర్కొంటున్నారు.

నయా మామిడి!

మార్కెట్లోకి కొత్త రకాలు



బనానా మేంగో



మియాజాకీ మామిడి



థాయిలాండ్ వైట్ మేంగో

కడియం, మే 20: కడియం నర్సరీ రైతులు విభిన్న మామిడి పండ్ల రకాలను పండిస్తున్నారు. బనానా, థాయిలాండ్ వైట్, మియాజాకీ తదితర రకాల మామిడి మొక్కలను తీసుకువచ్చి ఉత్పత్తి చేస్తున్నారు. ప్రస్తుతం కడియం నర్సరీల్లో ఈ సరికొత్త మొక్కలను పెంచుతున్నారు. కొత్తరకం మొక్కలను ప్రస్తుతం తోటలుగా వేసేందుకు, అలానే మార్కెటింగ్, నేల స్వభావం వంటి పరిస్థితులను ఆలోచించి రైతులు వీటిని పెంచడానికి ఉత్సాహం చూపుతున్నారు.

పండూరి మామిడి

చూడడానికి ఈ మామిడి పండ్లు పిందెల్లాగా కనిపిస్తాయి. ఆకుపచ్చని మామిడిపండ్లపై చిన్నచిన్న చుక్కలు ఉంటాయి. తింటే గాని వీటి మధురం తెలియదు. మిగలముగ్గిన పండు తొక్క కూడా ఆకుపచ్చగానే ఉంటుంది. ధరలోనూ ప్రియమే.

ఆల్ఫాన్సా మామిడి

హైబ్రిడైజేషన్‌తో పుట్టుకొచ్చిన సరికొత్త మామిడి ఆల్ఫాన్సా. రైతులను ఆర్థికంగా నిలదొక్కేందుకు కూడా ఎంతో ఉపకరిస్తాయి. గాలి వానల సమయంలో రాలకుండా ఉండడం వీటి ప్రత్యేకత. తేనెలొలికే తియ్యదనం మరో ప్రత్యేకత. వీటికి మార్కెట్‌లో డిమాండ్ ఎక్కువ.

బరామాస మామిడి

బరామాస ఏడాది పొడవునా కాస్తూ వేసవిలో అధికంగా కాయలు ఇస్తుంది. ఈ రకం మామిడి పండ్లు నిగనిగలాడుతూ పలకరించినట్లు ఉంటాయి. ఎక్కువ రోజులు నిల్వ ఉండడం వీటి ప్రత్యేకత. పీచు పదార్థం ఎక్కువగా ఉండడంతో పాటు టెంకభాగం వరకు గుజ్జు ఉంటుంది.

కొత్తరకాల మొక్కలు

బనానా మామిడి

ఇతర దేశాల నుంచి తీసుకువచ్చి పెంచుతున్న ఈ మామిడి అరటిపండులా సన్నగా, పొడవుగా ఉంటుంది. టెంక సన్నంగా ఉంటుంది. ఈ మామిడి తింటుంటే జ్యూస్ తాగినంత మధురానుభూతి కలుగుతుందని నర్సరీ రైతు జానకీరామ్(నాని) తెలిపారు.

థాయిలాండ్ వైట్‌మామిడి

ఈ చెట్టు వేసిన 3, 4 ఏళ్లకే కాపు కొస్తాయని నర్సరీ రైతు చెబుతున్నారు. ఈ ఫలాన్ని ముక్కలుగా కోసుకుని ఆరగిస్తుంటారు.

ఘనంగా భావనారాయణస్వామి గ్రామోత్సవం



సర్పవరం జంక్షన్, మే 20: కాకినాడ రూరల్ మండలం సర్పవరంలో శ్రీ రాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి దివ్య వార్షిక కల్యాణోత్సవాలు గత నాలుగు రోజులుగా భక్తుల ఆధ్వర్యంలో అత్యంత వైభవంగా జరుగుతున్నాయి. దేవదాయ,ధర్మదాయశాఖ ఆధ్వర్యంలో సోమవారం రాత్రి అత్యంత వైభవంగా స్వామివారి కల్యాణం నిర్వహించారు. స్వామివారి కల్యాణోత్సవాలను స్వయంగా తిలకించలేని భక్తుల కోసం సోమవారం రాత్రి నూతన వస్త్రాలు, విశేష పుష్పాలంకరణతో ఉన్న కల్యాణ దంపతులు శ్రీరాజ్యలక్ష్మి సమేత భావనారాయణస్వామి వారిని సింహవాహనంపై కొలువుదీర్చి మాడ వీధుల్లో గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు మాట్లాడుతూ స్వామివారి కల్యాణాన్ని స్వయంగా వీక్షించలేని భక్తులు, వృద్ధులు, దివ్యాంగులు, అనారోగ్య రుగ్మతలతో ఇంటి వద్దే ఉండిపోయిన వారి క్షేమాన్ని ఆకాంక్షిస్తూ స్వామివారిని గ్రామోత్సవం చేసినట్లు తెలిపారు.

లిఫ్ట్‌లో ఇరుక్కుపోయిన భక్తులు

అన్నవరం, మే 20: సత్యదేవుడి దర్శనానికి విచ్చేసిన ఒక భక్తబృందం సోమవారం రైల్వేస్టేషన్‌లో ఉన్న లిఫ్ట్‌లో సాంకేతికలోపం కారణంగా సుమారు గంటపాటు ఇరుక్కుపోయి ఇబ్బందులు ఎదుర్కొన్నారు. విజయవాడకు చెందిన 10 మంది బృందం ఆదివారం సత్యదేవుడి దివ్యకల్యాణం వీక్షించేందుకు విచ్చేసి తిరుగు ప్రయాణంలో ఉదయం 12.45కు రైల్వేస్టేషన్‌కు చేరుకున్నారు. మూడో నంబరు ప్లాట్‌ఫాం నుంచి ఒకటో నెంబరుకు వెళ్లేందుకు లిఫ్ట్ ఎక్కగా మధ్యలో నిలిచిపోయింది. సుమారు గంటసేపు దానిలో ఉండిపోయారు. అయితే సాంకేతిక సిబ్బంది అన్నవరంలో లేకపోవడంతో ఉన్నతాధికారులకు అన్నవరం స్టేషన్ సిబ్బంది సమాచారం ఇచ్చారు. వారి రాక ఆలస్యమవడంతో లిఫ్ట్ పైభాగం విప్పి సరిచేశారు. ఈ భక్త బృందం రత్నాచల్‌లో విజయవాడ చేరుకున్నారు. నరకం అనుభవించామని ఇంత పెద్ద పుణ్యక్షేత్రం కలిగిన రైల్వేస్టేషన్‌లో లిఫ్ట్ సాంకేతిక బృందం లేకపోవడం బాధాకరమని ప్రయాణికులు వాపోయారు.

ఏపీఈఏపీ సెట్‌కు రెండు సెషన్లలో 2176 మంది హాజరు


జేఎన్టీయూకే, మే 20: కాకినాడ జిల్లాలోని 5 పరీక్షా కేంద్రాల్లో ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి సోమవారం ఉదయం నిర్వహించిన పరీక్షకు 1,112 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1079 మంది హాజరయ్యారని, 33 మంది గైర్హాజరు కాగా 97.03 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ ప్రొఫెసర్ కె.వెంకటరెడ్డి తెలిపారు. అదే విధంగా మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 1,116 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1097 మంది హాజరయ్యారని, 19 మంది గైర్హాజరు కాగా 98.30 శాతం హాజరు నమోదైందన్నారు. మొత్తం రెండు సెషన్‌లలో 2,228 మంది హాజరుకావాల్సి ఉండగా 2,176 మంది హాజరయ్యారని 52 మంది పరీక్ష రాయలేదని 97.67 శాతం హాజరు నమోదైనట్లు తెలిపారు. తూర్పుగోదావరి జిల్లాలో ఇంజనీరింగ్‌లో ప్రవేశాల కోసం రాజమహేంద్రవరం ఐయాన్ డిజిటల్ కేంద్రంలో ఆన్‌లైన్‌లో రెండు సెషన్‌లలో నిర్వహించిన పరీక్షకు 1377 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 1341 మంది హాజరయ్యారని, 36 మంది పరీక్ష రాయలేదని మొత్తం 97.39 శాతం హాజరు నమోదైందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలోని భట్లపాలెంలో గల బీవీసీ ఇంజనీరింగ్ కళాశాల కేంద్రంలో రెండు సెషన్లలో నిర్వహించిన ఇంజనీరింగ్ విభాగ పరీక్షకు 690 మంది హాజరు కావాల్సి ఉండగా 680 మంది హాజరయ్యారని 10 మంది గైర్హాజరు కాగా మొత్తం 98.55 శాతం హాజరు నమోదైనట్లు కన్వీనర్ తెలిపారు. ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించిన ప్రవేశ పరీక్షలు ఈనెల 23 వరకూ కొనసాగుతాయన్నారు.

ఎనిమిదో ప్రవక్త జయంత్యుత్సవం

మామిడికుదురు, మే 20: ముస్లిం ఆరాధ్య దైవం ఎనిమిదో ప్రవక్త హజరత్ ఇమామ్‌రజా జయంత్యుత్సవాన్ని నగరం, మామిడికుదురు, జగ్గన్నపేటలలో ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. మామిడికుదురులోని ఇమామ్ రజా పంజాలో, జగ్గన్నపేటలోని బడా ఆస్తానాల్లో సోమవారం మిలాద్‌లు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో మత ప్రబోధకులు సయ్యద్ అబ్బాస్ బాకరీ, మహ్మద్ ఇబ్రహీం, ఇమామ్ రజా జీవిత చరిత్రలోని ముఖ్య ఘట్టాలను, మహిమలను భక్తులకు వివరించారు.

కానరాని ఇరిగేషన్ క్లోజర్ పనులు

- ప్రతి ఏటా ప్రతిపాదనలకే పరిమితం
- లొల్ల లాకులకు పెను ప్రమాదం

ఆత్రేయపురం మండలం లొల్ల లాకులు, లొల్ల లాకుల వద్ద రెండుగా విడిపోయిన కాలువలు

ఆత్రేయపురం, మే 20: బ్రిటీష్ హయాం నుంచి సెంట్రల్ డెల్టాకు సాగు నీరందించే లొల్ల లాకులకు పెను ప్రమాదం పొంచి ఉంది. ఐదేళ్ల జగన్ పాలనలో ఇరిగేషన్ వ్యవస్థను మెరుగుపరచకపోవడంతో లాకుల వ్యవస్థ పూర్తిగా దెబ్బతింది. శివారు రైతులకు సాగు నీరందని పరిస్థితి దాపురించింది. రైతు సంక్షేమమే మా ప్రభుత్వ లక్ష్యం.. రైతులకు కోసం ఎన్నో పథకాలు ప్రవేశపెట్టామంటూ ప్రకటనలకే తప్ప జగన్ పాలనలో చేసింది శూన్యం. కోనసీమ జిల్లాలోని 16మండలాలకు లొల్ల లాకుల ద్వారానే సాగునీటి పంపిణీ జరుగుతోంది. అమలాపురం, ముక్తేశ్వరం, గన్నవరం, బ్యాంకు కెనాల్ కాలువల ద్వారా 1.75లక్షల ఎకరాలకు సాగునీటి జలాలు అందు తున్నాయి. 1881లో లొల్ల లాకులను నిర్మించి నాలుగు కాలువల ద్వారా జిల్లా రైతులకు సాగునీరు వెళ్లే ఏర్పాటు చేశారు. ప్రస్తుతం లొల్ల లాకులు పూర్తిగా దెబ్బతిన్నాయి. బ్యాంకు కెనాల్ లాకులు శిథిలస్థితికి చేరుకోవడంతో నిత్యం వెళ్లే వాహనాలతో ప్రమాదం పొంచి ఉంది. గతంలో కలెక్టర్ల బృందం పర్యటించి ఆధునికీకరణ పనులకు ప్రతిపాదనలు రూపొందించారు. అవి కూడా కార్యరూపం దాల్చలేదు. ప్రస్తుత వేసవిలో క్లోజర్ పనులు చేపట్టాల్సి ఉంది. అవుట్‌ఫాల్ స్లూయిస్‌లకు, లొల్ల లాకుల గేట్లకు మరమ్మతులు చేయడం, గ్రీజు పెట్టడం, తారుపూయడం చేయాలి. శివారు ప్రాంతాలకు సాగునీరు సక్రమంగా వెళ్లేలా కాల్వల్లో పూడిక తీయాలి. ఈఐదేళ్ల కాలంలో ఒక్క పని కూడా చేపట్టలేదు. అక్కడక్కడా రిటైనింగ్ వాల్స్ నిర్మించాల్సి ఉంది. ఈవేసవిలో డెల్టా పరిధిలోని పనులకు రూ.54కోట్లతో ఇరిగేషన్ అధికారులు ప్రతిపాదనలు రూపొందించి ప్రభుత్వానికి నివేదించారు. వేసవిలో ఒక్కపని కూడా చేపట్టలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జూన్ మొదటి వారంలో సెంట్రల్ డెల్టా కాలువలకు సాగునీరు విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.





ప్రమాదభరితంగా బ్యాంక్ కెనాల్ లాకులు, శిథిలస్థితిలో లాకు సూపరింటెండెంట్ కార్యాలయం, పడవ వెళ్లే మార్గంలో గేట్లకు రంధ్రాలు

వరి కోతలను తక్షణం పూర్తిచేయాలి

అంబాజీపేట, మే20: తుఫాన్ హెచ్చరికల నేపథ్యంలో వరి కోతలను రైతులు తక్షణం పూర్తిచేసుకోవాలని ఏవో సీహెచ్‌డీ విజయకుమార్ సూచించారు. మాచవరం, ఇసుకపూడి, చిరతపూడి, పుల్లేటికుర్రు గ్రామాల్లో సోమవారం ఆయన పర్యటించి రైతులకు పలు సూచనలు చేశారు. మండలంలో 3,290ఎకరాల్లో వరి సాగు చేయగా ఇప్పటివరకు 90శాతం వరి కోతలు పూర్తయ్యాయన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం

ఆత్రేయపురం, మే 20: ఆత్రేయపురం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి నమశ్శివాయ ఆధ్వర్యంలో సోమవారం వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహించారు. పుస్తక పఠనం చేయించి నీతి కథలు చదివించారు. విశ్రాంత ఉద్యోగి అల్లు రామకృష్ణ విద్యార్థులకు వివిధ అంశాలను వివరించారు. ఉపాధ్యాయుడు కల్లేపల్లి రత్నంరాజు విద్యార్థులకు భాషా పరిజ్ఞానం నేర్పారు. ఎంఈవో వరప్రసాదరావు శిబిరాన్ని సందర్శించారు.

ఉచిత విద్యకు 64మంది ఎంపిక

ఆలమూరు, మే20: మండలంలోని ప్రైవేట్ స్కూల్స్‌లో 64మంది పేద విద్యార్థులకు ఉచిత ప్రవేశానికి అర్హత లభించిందని ఎంఈవో సుబ్బరాజు తెలిపారు. 40మంది మాత్రమే చేరేందుకు అంగీకరించగా 24మంది ప్రైవేట్ స్కూల్లో చేరడానికి నిరాకరించారని, వారు లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారని ఆయన వివరించారు.

కార్డన్ అండ్ సెర్చ్‌లో 27వాహనాలు స్వాధీనం

ద్రాక్షారామ, మే 20: ఎన్నికల కోడ్, ఓట్ల లెక్కింపు నేపథ్యంలో ఉట్రుమిల్లి శివారు రాజీవ్‌గృహకల్ప అపార్టుమెంటులో సోమవారం మధ్యాహ్నం డీఎస్పీ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో సీఐ దొరరాజు, ఎస్‌ఐలు జి.సురేంద్ర, కె.సురేష్‌బాబు, జానీబాషా, పోలీసు సిబ్బంది కార్డన్ అండ్ సెర్చ్ నిర్వహించారు. ఎటువంటి రికార్డులు లేని 27వాహనాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహన యజమానులు సరైన పత్రాలు తీసుకురావాలని లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. కొత్తవ్యక్తులు అపార్టుమెంట్‌లో ఉంటే పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు.

యంగ్ టైగర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు



కేక్ కట్‌చేసి తినిపిస్తున్న ఎంపీ అభ్యర్థి హరీష్‌మాధుర్

అమలాపురం టౌన్, మే 20: యంగ్ టైగర్ ఎన్టీఆర్ జన్మదిన వేడుకలను స్టేట్ వైడ్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ కన్వీనర్ రాయుడు బాబ్జీ ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించారు. అమలాపురం శేఖర్ థియేటర్‌లో ఆది సినిమా ప్రదర్శించారు. అనంతరం అన్నదానం చేశారు. అమలాపురం లోక్‌సభ టీడీపీ అభ్యర్థి గంటి హరీష్‌మాధుర్ కేక్ కట్ చేసి అభిమానులకు తినిపించారు. ఆయా కార్యక్రమాల్లో జిల్లా ఆర్గనైజర్ కొపనాతి వెంకట్రాజు, అభిమాన సంఘాల నాయకులు మట్టపర్తి రాము, ఓలేటి రాంబాబు, పి.వెంకట్రామయ్య, కోసంశెట్టి గణేష్, లంకే రవి, వాసంశెట్టి శివశంకర్, నూటుకుర్తి శ్రీనివాస్, జగడం సత్యనారాయణ పాల్గొన్నారు.

ఎన్టీఆర్ అభిమానులు 50మంది రక్తదానం

ద్రాక్షారామ, మే 20: జూనియర్ ఎన్టీఆర్ 41వ జన్మదినోత్సవం పురస్కరించుకుని సోమవారం ద్రాక్షారామలో జూనియర్ ఎన్టీఆర్ సేవా సమితి ఆధ్వర్యంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. కాకినాడ రోటరీ బ్లడ్‌బ్యాంక్, రామచంద్రపురం ఏరియా ఆసుపత్రి సౌజన్యంతో ఏర్పాటు చేసిన శిబిరంలో 50మంది అభిమానులు రక్తదానం చేశారు. ఖండవిల్లి ప్రదీప్‌కుమార్, రాపాక శివప్రసాద్ ఇటీవల అనారోగ్యంతో మృతిచెందారు. వారి కుటుంబ సభ్యులకు రూ.40వేలు చొప్పున ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా తారక్ సంక్షేమ సేవా సంఘం తరపున అందజేశారు. అనంతర ఎన్టీఆర్ అభిమానుల సమక్షంలో భారీ కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో ఎన్టీఆర్ సేవా సమితి గౌరవ అధ్యక్షుడు వాసంశెట్టి శ్యామ్, అధ్యక్షుడు సాదే రాజేష్‌కుమార్, కార్యదర్శి శీలం మణికంఠ, సంయుక్త కార్యదర్శి క్రాంతికుమార్, చంద్రశేఖర్, దుర్గాప్రసాద్, విజయ్‌నాగరాజు, సుబ్బు, వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు తొగరు మూర్తి, ఎన్టీఆర్ అభిమానులు పాల్గొన్నారు.

కొత్తపేటలో ఎన్టీఆర్ జన్మదిన వేడుకలు

కొత్తపేట, మే 20: ప్రముఖ సినీనటుడు జూనియర్ ఎన్టీఆర్ జన్మదినోత్సవం సందర్భంగా ఆయన అభిమానులు కొత్తపేట పాతబస్టాండ్ సెంటర్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. అనంతరం అనాథలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కొత్తపేట మండలం ఎన్టీఆర్ ఫ్యాన్స్ అధ్యక్షుడు తుపాకుల సాయికృష్ణ, మట్టా బాలు, పినిపే ప్రసన్నకుమార్, చింతపల్లి నాని, శీలం కొండబాబు, బొక్కా ప్రసాద్ పాల్గొన్నారు.

భీమ్ విజ్ఞాన కేంద్రం ప్రారంభం

మామిడికుదురు, మే 20: గ్రామీణ ప్రాంతాల్లోని ఎక్కువమంది విద్యార్థులు ఇంగ్లీషు, సైన్స్, గణితంలో వెనుకబడి ఉంటున్నారని, వారి కోసం భీమ్ విజ్ఞాన కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్టు ఆంధ్రప్రదేశ్ షెడ్యూల్డ్ కులాల వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు పి.నకులరాజు తెలిపారు. మామిడికుదురులోని ఎస్సీ సామాజిక భవనంలో ఈకేంద్రాన్ని సంక్షేమ సంఘం మండల శాఖ ఆధ్వర్యంలో సోమవారం ప్రారంభించారు. ఈతరగతులు జూన్ 5వరకు జరుగుతాయన్నారు. కార్యక్రమంలో మండలశాఖ అధ్యక్షుడు భూపతి మనోహర్‌రాజు, ప్రధాన కార్యదర్శి కె.కల్యాణ్‌బాబు, ఆర్థిక కార్యదర్శి ఎన్.శ్రీనివాసరావు, సాధనాల సత్యనారాయణ, బత్తుల రమేష్‌బాబు, కలిగితి పల్లంరాజు, మట్టా శ్రీధర్, గెడ్డం భాస్కర్, టీఆర్కే గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

మోడరన్ విద్యార్థులకు ర్యాంకులు

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 20: సోమవారం విడుదలైన జేఈఈ మెయిన్స్ బీఆర్క్‌లో మోడరన్ కళాశాల విద్యార్థులు ఆలిండియా ఈడబ్ల్యుఎస్ కోటాలో కె.సుహర్షిత్ 35వ ర్యాంకు, ఎస్.ఎస్.టి.సంతోష్ 202వ ర్యాంకు సాధించినట్లు విద్యా సంస్థల అధినేత లయన్ జీవీ రావు తెలిపారు. విద్యార్థులను జీవీ రావు, ప్రిన్సిపాల్ పి.ఎస్.ప్రకాస్, అకడమిక్ అడ్వయిజర్ సీహెచ్ శ్రీనివాస్, అధ్యాపకులు అభినందించారు.

కనకమహాలక్ష్మి ఆలయానికి రూ.లక్ష విరాళం

ఆలమూరు, మే 20: చొప్పెల్ల గ్రామ దేవత కనకమహాలక్ష్మి ఆలయ నిర్మాణానికి ఆలమూరుకు చెందిన రైస్‌మిల్లు వ్యాపారవేత్త వంటిపల్లి పాపారావు రూ.లక్ష విరాళం అందించారు. దాతను పలువురు అభినందించారు.

ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డే



అమలాపురం టౌన్, మే 20: అంతర్జాతీయ ఎయిడ్స్ క్యాండిల్ లైట్ మెమోరియల్ డేను కలెక్టర్ హిమాన్షు శుక్లా ఆధ్వర్యంలో పట్టణంలో గడియార స్తంభం సెంటర్లో సోమవారం నిర్వహించారు. అదనపు డీఎంహెచ్‌వో డాక్టర్ సీహెచ్‌వీవీ భరతలక్ష్మి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఐవీ, ఎయిడ్స్‌తో మృతి చెందిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని కోరుతూ కొవ్వొత్తుల ప్రదర్శన జరిపారు. ఐసీటీసీ మెడికల్ ఆఫీసర్ చంద్రశేఖర్ హెచ్ఐవీ నివారణకు తీసుకుంటున్న చర్యలను వివరించారు. స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కుంచే స్వర్ణలత, మెండు కమల, జల్లి సుజాత, శ్రీనివాస్, విహాన్, సందీప్, డాక్టర్ సునీల్‌కుమార్, డాక్టర్ ఏసేబు,ఏవీ రామరాజు, పి.చంద్రశేఖర్, నల్లా నరసింహమూర్తి, ఏఆర్‌టీ సిబ్బంది, ఆశాలు, ఏఎన్‌ఎంలుపాల్గొన్నారు.

నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు

అమలాపురం రూరల్, మే 20: ఎన్నికల ఓట్ల లెక్కింపు సమయం ఆసన్నమవుతున్నందున నిబంధనావళిని ఎవరైనా అతిక్రమిస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని అమలాపురం తాలూకా ఎస్‌ఐ వై.శేఖర్‌బాబు హెచ్చరించారు. ఎన్నికల కోడ్‌తో పాటు సెక్షన్ 144, సెక్షన్ 30 పోలీసు యాక్టు అమలులో ఉందని వివరించారు. సోమవారం భట్నవిల్లి, బండారులంక గ్రామాల్లో పెద్దలు, నాయకులతో సమావేశాలు నిర్వహించారు. నలుగురైదుగురు గుమిగూడి ఉన్నా, రెచ్చగొట్టే ప్రకటనలు చేసినా చర్యలు తీసుకుంటామన్నారు. ఓట్ల లెక్కింపు రోజున విజయోత్సవాలకు ఎటువంటి అనుమతులు లేవని ఎస్‌ఐ స్పష్టం చేశారు.

ఘనంగా శ్రీకేశవస్వామి కల్యాణ మహోత్సవం








ముమ్మిడివరంకేశవస్వామివారి, అంతర్వేది: శ్రీకనకముత్యాలమ్మ, అమలాపురం:శ్రీగంగాదేవి మురుగులమ్మ, కాట్రేనికోన: ఉప్పూడిలో గంగాదేవరమల్లమ్మ, కాట్రేనికోన మావుళ్ళమ్మ, మామిడికుదురు:ఈదరాడలో శివుని కల్యాణం

ముమ్మిడివరం, మే 20: ముమ్మిడిరంలోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీకేశవస్వామివారి కల్యాణ మహోత్సవం ఆదివారం రాత్రి వైభవంగా జరిగింది. ఈనెల19న ప్రారంభమైన స్వామివారి కల్యాణోత్సవాలు 24వతేదీ పుష్ప యాగంతో ముగియనున్నాయి. కల్యాణోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి స్వామి-అమ్మవార్ల కల్యాణోత్సవాన్ని ఘనంగా జరిపించారు. సోమవారం ఉదయం నిత్యోపాసన, బలిహరణ కార్యక్రమాలు నిర్వహించారు. చిన్నారులతో భరతనాట్య కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకుని పూజా కార్యక్రమంలో పాల్గొన్నారు. ఆలయ అర్చకులు సుదర్శనం రామచిరంజీవి మంత్రోచ్చారణల నడుమ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ ఈవో పామర్తి కనకలక్ష్మణరావు, చైర్మన్ కేశనకుర్తి సురేష్‌కుమార్ పాల్గొన్నారు.

శ్రీరాజగోపాలస్వామికి ప్రత్యేక పూజలు

పి.గన్నవరం, మే 20: లంకలగన్నవరంలో శ్రీరుక్మిణి సత్యభామ సమేత రాజగోపాలస్వామి వార్షిక కల్యాణ మహోత్సవాల్లో భాగంగా సోమవారం స్వామి,అమ్మవార్లకు ప్రత్యేక అభిషేకాలు, విశేష పూజలు నిర్వహించారు. మిర్తిపాటి ఆధ్వర్యంలో స్వామివారికి వైశాఖ సేవ పూజా కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు రవికలు, విసినకర్రలు, ప్రసాదం అందించారు.

శివకేశవుల ఆలయంలో వైశాఖ పూజ

అంబాజీపేట, మే 20: గంగలకుర్రు అగ్రహారంలో ఉన్న శ్రీ ఉమాపార్వతీ సమేత వీరేశ్వరస్వామి, శ్రీభూదేవి శ్రీదేవి సమేత కేశవస్వామివార్ల కల్యాణ మహోత్సవంలో భాగంగా సోమవారం వైశాఖ పూజ నిర్వహించారు. గ్రామానికి చెందిన తాతా కామన్నదొర కుటుంబ సభ్యులు తాతా చిట్టిబాబు-లలిత, తాతా సుబ్బయ్య- అన్నపూర్ణ దంపతుల ఆధ్వర్యంలో ఆలయ అర్చకులు చంద్రమౌళి వెంకటనరసింహశర్మ, సుదర్శనం కేశవచార్యులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందించారు.

ఘనంగా కనకముత్యాలమ్మ జాతర

అంతర్వేది, మే 20: గొంది గ్రామంలో సోమవారం రాత్రి కనకముత్యాలమ్మవారి జాతర మహోత్సవాలు వైభవంగా జరిగాయి. బాణసంచా కాల్పులు, కోయడ్యాన్సులు, బుట్టబొమ్మలు, మిరుమిట్లు గొలిపే విద్యుత్ అలంకరణలు, కలువపువ్వుల నృత్య ప్రదర్శన భక్తులను ఆకట్టుకున్నాయి. నాలుగు రోజులు జరిగే జాతర మహోత్సవాల్లో ప్రతీరోజు అమ్మవారికి కుంకుమ పూజలు, జానపద, నృత్య కార్యక్రమాలు, శ్రీకోదండరామ భజనా గీతాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శృంగవరప్పాడులో బలుసులమ్మ, కాళికాదేవి, కనకదుర్గమ్మవార్ల జాతర మహోత్సవాల్లో భాగంగా సోమవారం మధ్యాహ్నం అమ్మవారి రథోత్సవం వైభవంగా జరిగింది.

మురుగులమ్మ జాతర

అమలాపురం రూరల్, మే 20: బండారులంక గ్రామ దేవత శ్రీగంగాదేవి మురుగులమ్మవారి జాతరను సోమవారం రాత్రి నిర్వహించారు. సెక్షన్ 144 అమలులో ఉండడంతో జాతరను నిబంధనలకు అనుగుణంగా నిర్వాహకులు నిర్వహించారు. మంగళవారం అమ్మవారి ఆలయం వద్ద తీర్థం నిర్వహించనున్నట్టు గ్రామ పెద్దలు చింతా శంకరమూర్తి, దంగేటి రుద్ర, పిచ్చిక శ్యామ్, జాన గణేష్, బళ్ల వెంకటేశ్వరరావు, కండిబోయిన వెంకటేశ్వరరావు తెలిపారు.

ఘనంగా అమ్మవార్ల జాగారం ఉత్సవం

కాట్రేనికోన, మే 20: కాట్రేనికోన, ఉప్పూడి గ్రామదేవతలు మావుళ్ళమ్మ, గంగాదేవరమల్లమ్మ తీర్థాలు మంగళవారం జరగనున్నాయి. సోమవారం రాత్రి జాగారం ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఆలయాల ప్రధాన ఆసాదుల ఆధ్వర్యంలో పూజ ఘటాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. మేళతాళాలతో, మంగళవాయిద్యాలతో, అమ్మవారి గరగలతో ఆసాదులు నృత్యం చేస్తూ అమ్మవార్ల జన్మవృత్తాంతం దండక రూపంలో విన్పించారు. శక్తి వేషాలు, బాణసంచాకాల్పులతో అమ్మవార్లు పురవీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. తీర్థం సందర్భంగా ఆలయాలను సుందరంగా అలంకరించారు.

ఘనంగా స్వామివార్ల కల్యాణాలు

మామిడికుదురు, మే 20: పలుగ్రామాల్లో ఈశ్వరుని కల్యాణ మహోత్సవాలు ఆదివారం రాత్రి ఘనంగా జరిగాయి. ఈదరాడలో వేంచేసి ఉన్న శ్రీఉమాసోమేశ్వరస్వామి, శ్రీలక్ష్మీనరసింహస్వామి కల్యాణం, గోగన్నమఠంలో వేంచేసి ఉన్న శ్రీపార్వతీ సోమేశ్వరస్వామి, అప్పనపల్లిలో కొలువుదీరిన శ్రీకాశీఅన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి కల్యాణోత్సవాలను వేదమంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల నడుమ శాస్త్రోక్తంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో భక్తులు కల్యాణోత్సవంలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థ, ప్రసాదాలు స్వీకరించారు.

జూన్ నుంచి ఆదాయపు పన్ను రికవరీ



ఏటీవో రంగారావును కలుసుకున్న పెన్షనర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

అమలాపురం టౌన్, మే 20: జూన్ నెల నుంచి పెన్షనర్ల పెన్షన్ నుంచి ఆదాయపు పన్ను రికవరీ చేస్తామని అమలాపురం అసిస్టెంట్ ట్రెజరీ అధికారి ఎస్వీవీ రంగారావు తెలిపారు. ఆదాయపు పన్ను పరిధిలోకి వచ్చిన పెన్షనర్లంతా ఈనెల బిల్లుల నుంచి ఆదాయపు పన్ను రికవరీ చేయాలని జిల్లా ట్రెజరీ-అక్కౌంట్స్ అధికారి రామనాథం ఉత్తర్వులు ఇచ్చినట్టు చెప్పారు. పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ ప్రతినిధుల బృందం సోమవారం ఏటీవోను కలుసుకుంది. పెన్షనర్లంతా ఆదాయపు పన్నుకు న్యూ రీజియం పరిధిలోకి వస్తారన్నారు. స్టాండర్డ్ డిడక్షన్ పోను రూ.7లక్షలలోపు పెన్షన్ ఆదాయం ఉన్నవారు ట్యాక్స్ పరిధిలోకి రారని వివరించారు. రూ.7లక్షలు పైబడి ఆదాయం ఉన్న పెన్షనర్ల నుంచి వారు చెల్లించాల్సిన ఆదాయపు పన్ను మదింపు చేసి ఈఏడాది మే నుంచి 2025 ఫిబ్రవరి వరకు పది సమాన వాయిదాల్లో రికవరీ చేస్తామని ఏటీవో వివరించారు. ఓల్డ్ రీజియంలో కొనసాగాలనుకునే పెన్షనర్లు వారి సేవింగ్స్ వివరాలతో దరఖాస్తు అందజేయాలన్నారు. ఈఏడాది ఫిబ్రవరితో ముగిసిన ఆర్థిక సంవత్సరానికి జూలై 31లోగా రిటర్న్ ఇ-ఫైలింగ్ చేయాలన్నారు. ఆదాయపు పన్నుతో సంబంధం లేకుండా రూ.3లక్షలు పైబడి పెన్షన్ ఆదాయం ఉన్నవారు తప్పనిసరిగా ఇ-ఫైలింగ్ చేసుకోవాలని రంగారావు తెలిపారు. ఏటీవోను కలిసిన వారిలో అసోసియేషన్ జిల్లా నాయకులు కేకేవీ నాయుడు, ఎన్‌సీహెచ్‌కృష్ణమూర్తి, ఎం.సాయివరప్రసాద్ తదితరులు ఉన్నారు.

రోడ్డు పక్క దుకాణాల తొలగింపు

అమలాపురం టౌన్, మే 20: అమలాపురం ఆర్టీసీ డిపో ఏరియాలో మెయిన్‌రోడ్డుపై వాహనదారులకు అవరోధంగా ఉన్న దుకాణాలను ఎస్‌ఐ నబీ ఆధ్వర్యంలో సోమవారం తొలగించారు. కొంత కాలంగా వాహనదారులు పడుతున్న ఇబ్బందులను గుర్తించి అమలాపురం డీఎస్పీ ఎం.మహేశ్వరరావు ఆధ్వర్యంలో మెయిన్‌రోడ్డును ఆనుకుని ఏర్పాటుచేసిన మట్టి గుట్టలను, దుకాణాలను తొలగించారు.

సినిమా గైడ్

అమలాపురం

వెంకటరామ	: --
వెంకటరమణ	:బాక్
శ్రీలలిత	:మిరల్
శేఖర్ స్క్రీన్-1	: కృష్ణమ్మ
శేఖర్ స్క్రీన్-2	: దర్శిని
రమా	:ఆ ఒక్కటి అడక్కు
గణపతి	:రత్నం
వెంకటపద్మావతిస్క్రీన్-1	కింగడమ్
వెంకటపద్మావతి స్క్రీన్-2	నటరత్నాలు

అంబాజీపేటలో అడ్వాన్స్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రం

అంబాజీపేట, మే 20: స్థానిక జిల్లా పరిషత్ హైస్కూల్‌కు పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షా కేంద్రాన్ని మంజూరు చేసినట్టు హెచ్ఎం కడలి సాయిరామ్ తెలిపారు. ఈనెల24 నుంచి పరీక్షలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. అంబాజీపేట, పి.గన్నవరం మండలాల పరిధిలోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు చెందిన 30 పాఠశాలలకు చెందిన 183మంది విద్యార్థులు పరీక్షలకు హాజరవుతారన్నారు. హాల్‌టిక్కెట్‌పై సంబంధిత హెచ్ఎం సంతకం ఉండాలన్నారు. విద్యార్థి ఉదయం 9గంటలకు కేంద్రానికి చేరుకోవాలన్నారు. ఉదయం 9.30 నుంచి 12.45గంటల వరకు వరకూ పరీక్ష జరుగుతుందన్నారు.

జానపదంపై వాహినికి డాక్టరేట్



అమలాపురం టౌన్, మే 20: జానపద కథలపై ప్రొఫెసర్ జె.భీమయ్య పర్యవేక్షణలో అమలాపురానికి చెందిన బిళ్ల వాహిని చేసిన పరిశోధనకు హైదరాబాద్‌లోని కేంద్రీయ విశ్వవిద్యాలయం డాక్టరేట్ ప్రదానం చేసింది. జానపద సాహిత్యంలో ప్రధానంగా మత్స్యకార మహిళలపై వాహిని పరిశోధన చేశారు. గతంలో ఈమె కేంద్రీయ విశ్వవిద్యాలయం నుంచి ఎంఫిల్ పట్టా పొందారు. డాక్టరేట్ అందుకున్న వాహినికి ఎస్టీయూ జిల్లా శాఖ అధ్యక్షుడు పోతంశెట్టి దొరబాబు, జిల్లా ప్రధాన కార్యదర్శి సరిదే సత్యపల్లంరాజు, రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, మండల శాఖల ప్రతినిధులు గురునాయుడు, రత్నంరాజు, రాజేష్, కుడుపూడి హేమంత్, బాలకృష్ణ, జ్యోతికుమార్ అభినందనలు తెలిపారు.

వాడపల్లి వెంకన్న ఆదాయం రూ.2.79లక్షలు

ఆత్రేయపురం, మే 20: కోనసీమ తిరుమల వాడపల్లి శ్రీవేంకటేశ్వరస్వామిని సోమవారం వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు దర్శించుకున్నారు. వివిధ సేవల ద్వారా ఒక్కరోజు ఆదాయం రూ.2,79,787 లభించినట్టు ఉప కమిషనరు, ఈవో భూపతిరాజు కిషోర్‌కుమార్ తెలిపారు. వకుళమాత అన్నప్రసాద భవన నిర్మాణానికి రాజోలుకు చెందిన బలభద్ర రాయుడు కుటుంబ సభ్యులు రూ.51,116 విరాళం సమర్పించారు.

ఇంటర్ ప్రవేశాలకు దరఖాస్తుల స్వీకరణ

రాయవరం, మే 20: 2024-25విద్యా సంవత్సరంలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు రాయవరం జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ ఎం.రామారావు తెలిపారు. అడ్మిషన్ల కోసం కళాశాలను సంప్రదించాలని కోరారు.

సీతారామశాస్త్రి జయంతి

అమలాపురం టౌన్, మే 20: ప్రముఖ సినీ గేయ రచయిత సిరివెన్నెల సీతారామశాస్త్రి జయంతిని అమలాపురం గాంధీబజార్‌లోని ప్రథమ శ్రేణి శాఖ గ్రంథాలయంలో సోమవారం నిర్వహించారు. కోనసీమ రచయితల సంఘం, శ్రీశ్రీ కళా వేదిక జిల్లా శాఖ ఆధ్వర్యంలో శ్రీశ్రీ చిత్రపటానికి పలువురు పూలమాలలువేసి నివాళులర్పించారు. కేంద్ర ప్రభుత్వం నుంచి పద్మశ్రీ పురస్కారంతో పాటు సీతారామ శాస్త్రి పాటకు పదకొండు నంది అవార్డులతో పట్టాభిషేకం చేశారని సాహితీవేత్త నల్లా నరసింహమూర్తి పేర్కొన్నారు. గ్రంథాలయ అధికారి జీవీఆర్‌ఎస్‌హెచ్‌కే వర్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సాహితీవేత్తలు బీవీవీ సత్యనారాయణ, పోలిశెట్టి సత్యనారాయణమూర్తి, ముత్యాల శ్రీశరత్‌బాబు, కోటిపల్లి సత్యనారాయణ, రేమెళ్ల రామకృష్ణ, చిక్కాల రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

రేపు నరసింహ జయంతి

అంతర్వేది, మే 20: బుధవారం నరసింహ జయంతిని పురస్కరించుకుని అంతర్వేది శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని పచ్చని తోరణాలు, పుష్పాలంకరణతో ముస్తాబు చేసినట్టు ఆలయ సహాయ కమిషనర్ వి.సత్యనారాయణ తెలిపారు. 27రోజులు భక్తిశ్రద్ధలతో నక్షత్ర మాలదీక్షాధారణ చేపట్టిన భక్తులు బుధవారం ఉదయం ఆలయానికి చేరుకుని స్వామివారి నృసింహ జయంతి పర్వదినాని పంచామృతాలతో అభిషేకాలు నిర్వహించి ఇరుముడులు సమర్పిస్తారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు కృష్ణా జిల్లా నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు నృసింహ జయంతి సందర్భంగా ఆలయానికి చేరుకుంటారని ఏసీ తెలిపారు.

విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు

మలికిపురం, మే 20: గుడిమెళ్లంకలో పదోతరగతి, ఇంటర్మీడియట్ పరీక్షల్లో ప్రతిభకనబరిచిన 10మంది విద్యార్థులకు ఒక్కొక్కరికి రూ.15వేలు చొప్పున గుడిమెళ్లంక చారిటబుల్ ట్రస్టు అందించింది. సోమవారం మర్రిపేట పాఠశాల వద్ద జరిగిన కార్యక్రమంలో సంస్థ చైర్మన్, విశ్రాంత ఆర్మీ అధికారి చెల్లుబోయిన సత్యనారాయణ మాట్లాడుతూ పేద విద్యార్థుల ఉన్నత చదువులకు ఈప్రోత్సాహం ఉపయోగపడుతుందన్నారు. కడలి సాయిబాబా, చెల్లుబోయిన సూర్యచంద్రరావు, నాగూరు, చిట్టూరి శ్రీరాములుపాల్గొన్నారు.

యాదవ సంఘం ఆర్థిక సహాయం

మలికిపురం, మే 20: అనారోగ్యంతో బాధపడుతున్న గన్నవరానికి చెందిన డి.దుర్గాప్రసాద్‌కు రాజోలు నియోజకవర్గ శ్రీకృష్ణ యాదవ సంఘం సోమవారం రూ.15వేలు అందజేసింది. కార్యక్రమంలో శ్రీకృష్ణ యాదవ సంఘం అధ్యక్షుడు మందపాటి సత్యనారాయణ, మట్టా వెంకటరామకృష్ణ, నూనె రామకృష్ణ, సూరిమేను రాంబాబు, సతీష్, నాగరాజు, శివరామప్రసాద్‌పాల్గొన్నారు.

మూర్తి సేవలు ఆదర్శనీయం

అల్లవరం, మే 20: మౌలిక సదుపాయాలు, అభివృద్ధి పనుల శాఖ ప్రత్యేక కార్యదర్శి (విశ్రాంత) తాళ్ల సత్యనారాయణమూర్తి సేవలు ఆదర్శనీయమని నాతి శ్రీనివాసరావుతో పాటు పలువురు వక్తలు పేర్కొన్నారు. టీఎస్ఎన్ మూర్తి పుట్టినరోజు సందర్భంగా గోడి గురుకుల కళాశాల ఆవరణలో సోమవారం మొక్కలు నాటారు. తాళ్ల సాంబమూర్తి, యల్లమిల్లి నాగసుధకొండ, జల్లి శ్రీనివాసరావు, బళ్ల కమలతేజ తదితరులు పాల్గొన్నారు.

పెట్రోల్ లూజు అమ్మకాలు జరిపితే చర్యలు

రాయవరం, మే 20: పెట్రోల్ బంకుల్లో బాటిళ్లు, డబ్బాల్లో విడిగా పెట్రోల్ అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవని మండపేట రూరల్ సీఐ శ్రీధర్ కుమార్ అన్నారు. రాయవరంలో ఆయన పెట్రోల్ బంక్‌లు, బాణసంచా దుకాణదారులకు నోటీసులు జారీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జూన్ 4న సార్వత్రిక ఎన్నికల ఫలితాలు రానున్న నేపథ్యంలో మందుగుండు సామగ్రి ఎక్కువగా కొనుగోలుకు వస్తే అటువంటి వ్యక్తుల సమాచారం బాణసంచా దుకాణదారులు పోలీసులకు తెలియజేయాలని, గ్రామాల్లో ఎటువంటి సంబరాలకు అనుమతులు లేవన్నారు. గ్రామాల్లో గొడవలు జరిగే అవకాశం ఉంటే పోలీసులకు తెలియజేయాలన్నారు. అనంతరం సోమేశ్వరంలో ప్రజలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సీఐ వెంట ఎస్‌ఐ జి.నరేష్, సిబ్బంది ఉన్నారు.

'ఎన్డీయే కూటమికి 150సీట్లు ఖాయం'

రాజోలు, మే 20: సార్వత్రిక ఎన్నికల్లో జిల్లాలో మూడు వంతుల్లో రెండు వంతుల ఓట్లు ఎన్డీఏకు ప్రజలు వేశారని డాక్టర్ వైఎస్సార్ హార్టికల్చర్ యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ బోనం నాగేశ్వరరావు అన్నారు. తాటిపాకలో ఆయన స్వగృహం వద్ద మాజీ సర్పంచ్ డాక్టర్ బిక్కిన వీరాస్వామి అధ్యక్షతన సోమవారం జరిగిన ఎన్డీయే నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్డీయే కూటమికి 150సీట్లు రావడం ఖాయమన్నారు. ఎంపీపీ కేతా శ్రీను, మాజీ ఎంపీపీ పిల్లి శ్రీరామమూర్తి, సర్పంచ్ కోటిపల్లి రత్నమాల, పెట్టా సూరిబాబు, గుండాబత్తుల తాతాజీ, దేవళ్ల మాణిక్యాలరావు, పాటబళ్ల అప్పాజీ, ర్యాలి పట్టాభి పాల్గొన్నారు.

కోల సంబరం కళాకారుడికి సాయం

ద్రాక్షారామ, మే 20: గంగలకుర్రు గ్రామానికి చెందిన కోలసంబరం కళాకారుడు గుత్తుల విజయరాజు ఇటీవల ప్రమాదంలో చెయ్యి కోల్పోయాడు. వెంకటేశ్వర, దుర్గా కోల సంబరం కళాకారుల సంఘం గౌరవ అధ్యక్షుడు కోట శ్రీనివాస్, అధ్యక్షుడు ఈతా దుర్గారావు, ఉపాధ్యక్షుడు వాసంశెట్టి లక్ష్మణరావు, వెల్ల ఎంపీటీసీ చిక్కాల స్వామికాపు సోమవారం సంఘం తరపున రూ.50వేలు విజయరాజుకు అందజేశారు.

చికిత్స పొందుతూ మహిళ మృతి

ముమ్మిడివరం, మే 20: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఒక మహిళ సోమవారం మృతి చెందింది. రాజోలు మండలం సోంపల్లికి చెందిన చింతా వెంకటేశ్వరి(47) ఈనెల17న ఆమె చిన్నల్లుడు బడుగు ధనరాజుతో కలిసి మోటారుసైకిల్‌పై ముమ్మిడివరం వెళ్లి ఇంటికి తిరిగి వెళుతుండగా అనాతవరం వద్ద కుక్క అడ్డురావడంతో మోటారుసైకిల్ అదుపుతప్పి పడిపోయారు. ఈప్రమాదంలో వెంకటేశ్వరి తీవ్రంగా గాయపడగా కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ ఆమె సోమవారం మృతి చెందింది. ఆమెకు కుమారుడు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ముమ్మిడివరం ఏఎస్‌ఐ జాన్‌బాబు కేసు దర్యాప్తు చేపట్టారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

అంబాజీపేట, మే 20: చికిత్స పొందుతూ వ్యక్తి మృతిచెందాడు. పి.గన్నవరం మండలం పోతవరం ప్రభలదిబ్బకు చెందిన కాప లోవరాజు(31) ఈనెల14న అంబాజీపేటలోని మేనకోడలు ఇంటికి వచ్చాడు. అక్కడ పురుగుల మందు తాగాడు. స్థానికులు అతడిని అమలాపురం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ సోమవారం మృతిచెందాడు. సోదరుడు కాప దుర్గాప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ కె.చిరంజీవి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

అంబాజీపేట, మే20: స్థానిక డీసీసీబీ బ్యాంకు ఎదురుగా స్కూటీ, మోటార్‌సైకిల్ ఢీకొనడంతో వ్యక్తికి తీవ్రగాయాలయ్యాయి. అంబాజీపేటకు చెందిన గోళ్ళ కృష్ణ ఇంటి నుంచి స్కూటీపై స్థానిక సెంటర్‌కు వస్తుండగా ముంగండ వైపు నుంచి అమలాపురం బైక్‌పై వెళ్తున్న ఇద్దరు యువకులు స్కూటీని ఢీకొట్టారు. దీంతో కృష్ణకు బలమైనగాయాలు కాగా అతడిని అమలాపురం ఆసుపత్రికి తరలించారు. బైక్‌పై ప్రయాణిస్తున్న పితాని సాయికుమార్, బొక్కా నరేష్‌లకు స్వల్పగాయాలయ్యాయి. పోలీసులు వివరాలు నమోదుచేశారు.

పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి

రామచంద్రపురం(ద్రాక్షారామ), మే 20: రామచంద్రపురంలోని డా. చెలికాని రామారావు స్మారక భవనంలో పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి కార్యక్రమం ప్రజా సంఘాలు నిర్వహించాయి. పుచ్చలపల్లి సుందరయ్య చిత్రపటానికి పూలమాలలువేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు జి.సురేంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కరెం వెంకటేశ్వరరావు, సీఐటీయూ నాయకులు నూకల బలరాం, జి.దుర్గాప్రసాద్, అంగన్‌వాడీ సంఘం నాయకురాలు మేడిశెట్టి దుర్గమ్మ, సత్యవేణి, పద్మ, వెంకటేశ్వరరావు, కె.సత్తిబాబు పాల్గొన్నారు.

31వరకు సెంటాక్ గడువు పెంపు

యానాం, మే 20: పుదుచ్చేరిలోని వివిధ కళాశాలల్లో ప్రొఫెషనల్ కోర్సులకు సెంటాక్ (సెంట్రలైజ్డ్ అడ్మిషన్ కమిటీ) ఆధ్వర్యంలో దరఖాస్తుల స్వీకరణ గడువును ఈనెల 31వరకు పెంచినట్టు అధికారులు ప్రకటనలో తెలిపారు. 2024-25 విద్యా సంవత్సరానికి బీటెక్, బీఆర్క్, బీఎస్సీ, బీపీటీ, అగ్రికల్చర్ తదితర పారా మెడికల్ కోర్సులు, ఆర్ట్స్, సైన్సు కోర్సుల్లో ప్రవేశానికి అభ్యర్థులు తొలుత ఈనెల22లోగా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.సెంటాక్ పుదుచ్చేరి. ఇన్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తులు సమర్పించాలన్నారు. అయితే వీటి గడువును ఈనెల31వ తేదీ వరకు పొడిగించారు.

పనుల్లో నాణ్యత ఉండాలి

అల్లవరం, మే 20: ఉపాధి హామీ పనుల్లో పూర్తి నాణ్యత ఉండాలని ఎంపీడీవో బీఎస్ఎస్ కృష్ణమోహన్ సూచించారు. గోడితిప్ప, గోడిలంక, తుమ్మలపల్లి గ్రామాల్లో ఉపాధి పనులను సోమవారం ఆయన పరిశీలించారు. రోడ్లు, ప్రహరీ పనులు పరిశీలించి పలు సూచనలు చేశారు. ఇంజనీరింగ్ అసిస్టెంట్లు దిలీప్, రోజా, మహేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.